నేనూ, మీ వదినానూ. ఆల్టో కారు ఈమధ్యనే కొన్నాంరా!

ఈలోగా మోహనరావు భార్య రాజేశ్వరి కాఫీ కప్పులతో ప్రవేశించింది. బాగున్నారా? అంటూ కాఫీ అందించింది. ఆమె గెటప్‌లోనూ కొంత మార్పు, నగలూ కన్పించేయి. సత్యనారాయణ ఆశ్చర్యంలోంచి ఇంకా తేరుకోలేదు.

ఈ డబ్బంతా ఎక్కడిది? రిటైరయ్యాక నీకెలా వచ్చిందో లెక్క కట్టింది నేనే కదా? మీ అల్లుడికిచ్చెయ్యగా నీకు మిగిలింది ఒక లక్ష...

కాఫీ తాగు, చెబుతాను. మనది ముప్ఫై యేళ్ల స్నేహం. నా గురించీ, నా ఆలోచనల గురించి నీకు అన్నీ తెలుసు అంటూ కొడుకులకి తను ఉత్తరాలు రాయడం, మొదలైన విషయాలన్నీ చెప్పాడు.

సత్యనారాయణ ఆశ్చర్యపోయేడు. మరి ఈ డబ్బెక్కడి ది?

వస్తున్నా, అక్కడికే వస్తున్నా... ఈమధ్య మన దేశంలోకి ఒక కొత్త స్కీమ్, ముఖ్యంగా మనలాంటివాళ్లకు పనికివచ్చేది వచ్చింది. రివర్స్ మార్ట్‌గేజ్ లోన్ స్కీమ్ అని బ్యాంకు వాళ్లు దీనికి పేరు పెట్టారు. 60 సంవత్సరాలు పైబడిన నాలాంటివారికి సొంత ఇంటిమీద 15 సంవత్సరాల పీరియడ్ మించకుండా ఇంటిమీద లోన్ ఇస్తారు. మార్కెట్ రేటు ప్రకారం ఇంటికి విలువ కట్టి, ఈ వాల్యూ లోపు మనకు కావల్సినంత లోన్ ఇస్తారు! ఈ లోన్‌ని భార్యాభర్తలు జీవించినంత కాలం తీర్చనక్కరలేదు. అంటే ఇంటిని మార్ట్‌గేజ్ చేసుకుని లోన్ ఇస్తారు. భార్యాభర్తల తదనంతరం, విల్లు ప్రకారం వారసులకి నోటీసు ఇస్తారు. వారసులు ఇంటిమీద ఉన్న లోన్ తీర్చేసి ఇంటిని తీసుకోవచ్చు. ఒకవేళ వారసులకి ఈ లోన్ బెడద వద్దనుకుంటే లోన్ ఇచ్చిన ఇన్‌స్టిట్యూషనే ఇల్లుని స్వాధీనం చేసుకుంటుంది.

మనలాంటి మధ్యతరగతి వాళ్లకు, ముఖ్యంగా పెన్షన్ లెస్ ఉద్యోగులకు ఈ స్కీమ్ ఉపయోగపడుతుంది. ఇదో అయాచిత వరం. సర్వీసులో ఉండగా హౌస్ లోన్ తీసుకుని ఇల్లు కడతాం. మనం రిటైరయ్యే టైముకి దానికి మంచి మార్కెట్ రేటూ లభిస్తుంది. మామూలుగా అయితే, ఈ రేటు మనకేం లాభం? ఇల్లు అమ్మేస్తే సొంత గూడుండదు. ఎంత డబ్బున్నా జీవన సంధ్యలో సొంత ఇల్లు చాలా అవసరం కదా! ఇల్లు ఉంచుకుని డబ్బు పొందే మార్గం ఈ స్కీమ్‌లో ఉంది, బాగుంది కదూ!

ఈ రివర్స్ మార్ట్‌గేజ్ స్కీమ్‌ని ఈమధ్య బ్యాంకులు టేకప్ చేస్తున్నాయి. ఈ స్కీమ్ కింద నేను 20 లక్షల లోన్ తీసుకున్నాను. 3 లక్షలతో మారుతీ ఆల్టో కారు తీసుకుని, 2 లక్షలతో ఇంటిని సౌకర్యవంతం చేసుకున్నాను. మీ వదిన చిరకాల వాంఛ తీర్చడానికి 2 లక్షలతో నగలు, నా చిరకాల వాంఛ తీర్చుకోడానికి 1 లక్షతో పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు ఇచ్చే ట్రస్టు ఏర్పాటు చేశాను. క్రింద పక్క పోర్షన్ ఖాళీ చేయించి హోమ్ థియేటర్, సి.డి.లు, కిచెన్‌లో ఎక్విప్‌మెంట్ కింద 2 లక్షలు. మిగిలిన 10 లక్షల్లో 8 లక్షలు ఎఫ్.డి.లో వేసి, 2 లక్షలు సేవింగ్ బ్యాంక్ ఎకౌంట్‌లో పెట్టాను. ఈ డబ్బుతో ప్రతీ 3 నెలలకు ఒకసారి విహార యాత్రలతో పాటు పుణ్యక్షేత్ర దర్శనం, డ్రైవర్‌ని తీసుకుని కారులో వెళ్లి వస్తాం. మా తదనంతరం లోన్, వడ్డీ పోను మిగిలిన సొమ్ముని ట్రస్టుకు చెందేటట్టు విల్లు రాసేశాను కూడా!

వెరీగుడ్ రా మోహన్! నువ్వు చెప్పినట్టు ఈ ఇల్లు వారసులకివ్వడం అనేది అనాలోచిత చర్య. ఈ స్కీమూ, నీలాంటి తండ్రులూ... బాధ్యత చేపట్టని పిల్లలకో గుణపాఠం! నీకు నా హృదయపూర్వక అభినందనలు... అంటూ సంతోషంగా మోహనరావుకి షేక్‌హేండ్ ఇచ్చాడు సత్యనారాయణ.

-కొట్టి రామారావు (మచిలీపట్నం)

---




ఆ మాట ఇంకోసారి గనక అన్నావంటే, మర్యాదగా ఉండదు...

ఏం..ఏం చేస్తావేంటి?

ఏం చెయ్యాలో అదే చేస్తాను

అంటే.. కొడతావా? చంపుతావా?

కొడతానో, చంపుతానో. ఆ మాట మళ్లీ అన్నప్పుడు నీకే తెలుసుద్ది...

అంటాన్రా! ఒకసారి కాదు, వందసార్లంటాను

వందసార్లు అనేదాకా నీకు మాట్లాడే ఛాన్సిస్తానా? ఒక్కసారంటే చాలు, నీ పుచ్చె పుచ్చకాయలాగా తెగిపోవడానికి!

అంత మొనగాడివా? ఏదీ నా పుచ్చె తెగ్గొట్టు చూద్దాం!

మళ్లీ ఆ మాట అను చూద్దాం...

ఏం చేస్తావ్‌రా?

దమ్ముంటే మళ్లీ ఆ మాట అను చూద్దాం!

రే య్...

నీ అరుపులకిక్కడెవరూ జడిసిపోరు!

ఆ పక్కనే నిల్చుని ఉన్న నాకు చాలా చిరాకు వేసింది. అసహనంగా వాచ్‌లోకి చూసుకున్నాను. బాప్‌రే బాప్! పదిహేను నిముషాలు గడిచిపోయాయ్. కాళ్లు కూడా గుంజుతున్నాయ్.

ఆ మాట! అసలది ఏ మాట? అది తెలిస్తే, వెళ్లిపోదామని నేను చూస్తుంటే! ఇంటిదగ్గర చాలా పనులున్నాయ్. ఇక వెళ్లిపోదామా అనుకున్నాను. కానీ ఏ మనిషైనా ఆశాజీవే కదా! అందుకే కదల్లేకపోయాను.

ఏం చేస్తావ్?

పళ్లు జలజలమని రాలగొడ్తాను.

ఏదీ కొట్టు చూద్దాం, ఎలా రాలుతాయో?

ఇప్పుడు కాదు... నువ్ గనక మళ్లీ ఆ మాట అంటే. అప్పుడు...

నువ్ అనమంటే నేను అనాలా? అనను. నాకు బుద్ధి పుట్టినప్పుడే అంటాను.

ఎప్పుడన్నా సరే... నేను నీ తాట ఒలిచేది మాత్రం ఖాయం!

ఓర్పుకైనా ఓ హద్దు ఉంటుంది కదా! ఛీ ఛీ... ఈ వెధవలు ఇంతే అనిపించింది నాకు. అదీగాక ఇంటిదగ్గర అర్జెంటు పనులున్నాయ్.

ఇంక నాలో సహనం పూర్తిగా చచ్చిపోయింది. ఎంతసేపు చూసినా ఇలా మాటా మాటా అనుకోవడమేగానీ ఆ మాటేదో వాడు అనేదీ లేదు, వీడు వాడ్ని తన్నేదీ లేదు. ఉత్త వేస్టుగాళ్లు. కాలం విలువ తెలియని పరమ మూర్ఖులు.

వాళ్ల గొడవకి కారణమైన ఆ మాట ఏదో వినేసి వెళ్లిపోదామంటే వాళ్లు చెప్పి చావరే! నాకు విసుగొచ్చేసింది. కాలం విలువ తెలిసినవాడిని గనుక మరొక్క అరగంట ఎదురుచూసి, అప్పటికీ ఆ మాటేదో తెలియకపోవడంతో వాళ్ల వైపు తిట్టుకుంటూ చూసి, నా దారిన నేను వెళ్లిపోయాను.

-కె.లక్ష్మీకాంతమ్మ (నెల్లూరు)